నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I హైదరాబాద్, మంగళవారం 2 జూలై 2024 HYDERABAD


గాంధీ దవాఖాన వద్ద విద్యార్థినిని పోలీసుల జీపులోకి ఎక్కిస్తున్న పోలీసులు



చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీ వద్ద..


ఓయూ ఆర్ట్స్ కాలేజీ వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న విద్యార్థులు

# నిరుద్యోగుల రణగర్జన

## నగరంలోని పలు చోట్ల విద్యార్థులు, నిరుద్యోగుల నిరసన గళం

## ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద ఉద్రిక్తత .. పోలీసుల అదుపులో విద్యార్థులు

## గాంధీ వైద్యశాల వద్ద ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతల అరెస్టు


గాంధీ వైద్యశాలలో ఆమరణ నిరాహార దీక్షలో ఉన్న తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మోతీలాల్


మాసాబ్‌ట్యాంక్ గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ/ బన్సీలాల్‌పేట/ మెహిదీపట్నం, జూలై 1: నిరుద్యోగుల నిరసనలతో నగరం దద్దరిల్లింది. సమస్యలను పరిష్కరించాలంటూ తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మోతీలాల్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు ప్రజాప్రతినిధులు, నిరుద్యోగులు, నిరుద్యోగ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున మద్దతు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం గాంధీ దవాఖానలో మోతీలాల్‌ను పరామర్శించేందుకు వస్తున్న నాయకులను పోలీసులు అడ్డుకోవడం.. అక్రమ అరెస్టులకు పాల్పడటంతో వైద్యశాల వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. నిరుద్యోగుల ఆందోళనలు.. నిరసన ర్యాలీలతో ఉస్మానియా వర్సిటీ అట్టుడికింది.



**మెయిన్ లైబ్రరీ నుంచి..**

మెయిన్ లైబ్రరీ నుంచి విద్యార్థులు ఆర్ట్స్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం, ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బైఠాయించారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళన చేస్తున్న విద్యార్థి నాయకులను అదుపులోకి తీసుకుని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఇచ్చిన హామీల అమలు గురించి మాట్లాడితే తమను అరెస్టు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిది రోజులుగా విద్యార్థి నాయకుడు ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే ప్రభుత్వంలో చలనం లేదని మండిపడ్డారు. డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఓయూ వేదికగా వేలాది మందితో నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు జంగయ్య, కార్తీక్, వినోద్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

### పోస్టులు పెంచకపోతే.. పెద్ద ఎత్తున పోరాటం

**బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్**

బొల్లారం: మోతీలాల్‌ను పరామర్శించేందుకు గాంధీ వైద్యశాలకు వెళ్లిన బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రాకేశ్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 6నెలలు దాటిన నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం ముందుకు వచ్చి పోస్టులు పెంచకపోతే బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో నిరుద్యోగుల తరపున పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

**ఏజెన్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి..**

లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మాసబ్‌ట్యాంక్ వద్ద ఉన్న గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వం తక్షణమే ట్రైబల్ అడ్వైజరీ కమిటీ తీర్మానం మేరకు వంద శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు.


బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న నిరుద్యోగుల ఐకాస నాయకులు



సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న గెస్ట్ లెక్చరర్లు

## కాంగ్రెస్ గూండాగిరికి భయపడేది లేదు

### బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



మేడ్చల్, జూలై 1 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ గూండాగిరికి భయపడేది లేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వాణీ వీరారెడ్డిపై దాడి చేశారు. ఈ క్రమంలో సోమవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిండెంట్ కేటీఆర్ వాణీ వీరారెడ్డిని ఫోన్‌లో పరామర్శించారు. కాంగ్రెస్ శ్రేణులు చేస్తున్న దాడులను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఉద్యమాలు చేసి తెలంగాణ తెచ్చిన బీఆర్‌ఎస్ పార్టీకి ఇలాంటి దాడులు కొత్త కాదన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తాము అండగా ఉంటామన్నారు. కాంగ్రెస్ గూండాగిరిపై చట్టరీత్యా చర్యలు తీసుకునే వరకు పోరాడుతామన్నారు. కాగా, కాంగ్రెస్ దాడిలో గాయపడ్డ వాణీ వీరారెడ్డిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరామర్శించారు. దాడి ఘటనపై వివరాలను ఆమె భర్త వీరారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరుగుతున్న సమయంలో ఇతర వ్యక్తులకు ఎలా అనుమతి ఇచ్చారని మున్సిపల్ కమిషనర్, సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట చైర్మన్ రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్లు సురేశ్, నర్సింగ్‌గౌడ్, హరిబాబు, శ్రీధర్‌రెడ్డి, భరత్ తదితరులు ఉన్నారు.

## 4,5న నీళ్లు బంద్



సిటీబ్యూరో, జూలై 1 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేసే సింగూరు 3, 4 ఫేజ్‌లకు విద్యుత్ సరఫరా చేసే 123 కేవీ పెద్దాపూర్, కంది సబ్‌స్టేషన్లలో టీజీ ట్రాన్స్‌కో అధికారులు మరమ్మతు పనులు చేపడుతున్నారు. దీంతో గురువారం ఉదయం 7 గంటల నుంచి మరుసటి రోజు 5వ తేదీ శుక్రవారం ఉదయం 7 గంటల వరకు ఈ పనులు జరుగుతాయని, 24 గంటల పాటు పలు రిజర్వాయర్ల పరిధిలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. షేక్‌పేట, భోజగుట్ట రిజర్వాయర్ (లోప్రెజర్), జూబ్లీహిల్స్, సోమాజిగూడ, బోరబండ, బంజారాహిల్స్, ఎర్రగడ్డ, మూసాపేట, కేపీహెచ్‌బీ, హైదర్‌నగర్, నల్లగండ్ల, చందానగర్, హుడా కాలనీ, హఫీజ్‌పేట, మణికొండ, నార్సింగి తదితర ప్రాంతాల్లో నీటి అంతరాయం ఉంటుందన్నారు.

## చేతులు కాలాక.. మేల్కొని

### ఆక్రమణలపై హెచ్‌ఎండీఏ నోటీసులు

**మలుపు తిరిగిన మియాపూర్ భూముల వ్యవహారం**

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూలై 1 (నమస్తే తెలంగాణ)/మియాపూర్: మియాపూర్‌లోని హెచ్‌ఎండీఏ భూముల వ్యవహారం మరో మలుపు తిరిగింది. దశాబ్దాలుగా భూములు అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకోని హెచ్‌ఎండీఏ అధికారులు.. వేలాదిగా నిరుపేదలు వచ్చి గుడిసెలు వేసుకునేందుకు ప్రయత్నిస్తే గానీ మేల్కొనలేదు. ఈ నేపథ్యంలో ఆ భూముల్లో సంవత్సరాల కిందట వెలిసిన కాలనీలపై అధికారులు దృష్టిసారించారు. ఈ భూములు మీకెలా వచ్చాయో వివరణ ఇవ్వాలంటూ ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నారు.

**100 ఎకరాలకుపైగా అన్యాక్రాంతం..**

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 100, 101 సర్వే నంబర్లలో 550 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్న విషయం తెలిసిందే. 2003లోనే రెవెన్యూ శాఖ ఈ భూములను హెచ్‌ఎండీఏకు అప్పగించగా... కోర్టు కేసుల నేపథ్యంలో అధికారులు ఆ భూములను పట్టించుకోలేదు. కనీసం రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో కొంచెం కొంచెంగా... చివరకు వందెకరాలకు పైగా భూమి అన్యాక్రాంతమైంది. అందులో అనేక కాలనీలు వెలిశాయి. అయితే కొన్నిరోజుల కిందట వేలాది మంది నిరుపేదలు అందులో గుడిసెలు వేసేందుకు రావడంతో హెచ్‌ఎండీఏ అధికారుల్లో చలనం వచ్చింది. ఎట్టకేలకు పోలీసు శాఖ పెద్ద ఎత్తున బలగాలను మోహరించి, వారిని అక్కడి నుంచి పంపించారు. అయితే ఇప్పుడు ఆ భూముల రక్షణకు చర్యలు మొదలుపెట్టిన హెచ్‌ఎండీఏ... ఇప్పటికే చుట్టూ కందకం ఏర్పాటు చేసింది. ఫెన్సింగ్‌కు టెండర్లు పిలిచింది. ఇదే సమయంలో అన్యాక్రాంతమైన భూములపై దృష్టిసారించిన అధికారులు... సర్వే నంబర్ 100లో వెలిసిన ఎంఏనగర్‌లోని నిర్మాణాలకు నోటీసులు జారీ చేయడం మొదలుపెట్టారు. మరో 180 మందికి నోటీసులు జారీ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. నోటీసు అందుకున్న పది రోజుల్లో తగిన పత్రాలతో తమ కార్యాలయంలో సమాధానం ఇవ్వాలని అధికారులు నోటీసులో పేర్కొన్నారు. కానీ నోటీసులు అందుకున్న వారు మాత్రం ఇప్పటివరకు ఎవరూ తమకు సమాధానం ఇవ్వలేదని హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు.

**సూత్రధారులు బయటికొచ్చేనా?**

హెచ్‌ఎండీఏ అధికారులు ప్రస్తుతం ఆక్రమణలపై నోటీసులు ఇస్తుండటం తీవ్ర దుమారం రేపుతున్నది. అసలు ఈ నిర్మాణాల వెనక ఎవరు ఉన్నారనే దానిపై చర్చ జరుగుతున్నది. ప్రస్తుతం అక్కడ నివాసం ఉంటున్నవారు నిరుపేదలు అయినప్పటికీ వారి నుంచి గతంలో కొందరు లక్షల రూపాయలు వసూలు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు హెచ్‌ఎండీఏ అధికారులకు సైతం ఫిర్యాదులు అందుతున్నట్లు తెలిసింది. అయితే అధికారుల నోటీసులకు యజమానులు స్పందించి తమ డాక్యుమెంట్లను సమర్పిస్తే తప్ప.. అసలు సూత్రధారులు ఎవరనేది తెరపైకి రాదని అధికారులు అంటున్నారు.

**కబ్జాలు చేస్తుంటే కండ్లు మూసుకున్నారా?**

**- ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ**

మియాపూర్ సర్వే నంబర్ 100లో విలువైన భూమిని రక్షించేందుకు గతంలోనే బల్దియా కమిషనర్‌తో కలిసి తాము ప్రయత్నించినప్పటికీ కొందరు హెచ్‌ఎండీఏ అధికారులు అడ్డుపడి.. ముందడుగు పడకుండా చేశారని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. భూములు ఆక్రమణకు గురవుతున్నా కండ్లు మూసుకున్నారని మండిపడ్డారు. సోమవారం ఎంఏనగర్‌లో పర్యటించిన ఆయన... ఆ కాలనీవాసులకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. కాగా, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు ఎంసీపీఐ ఆధ్వర్యంలో బాధితులు నిరసన చేపట్టి, కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు.


ఎంఏనగర్‌లో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ



సోమవారం జలమండలి ఎదుట నిరసన తెలుపుతున్న డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు

## డబుల్ ఇండ్లు.. కన్నీళ్లు

సిటీబ్యూరో : కేసీఆర్ ప్రభుత్వం నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించాలన్న లక్ష్యంతో డబుల్ బెడ్రూం ఇండ్ల ప్రాజెక్టును చేపట్టి.. దాదాపు 66వేల మందికిపైగా పేదలకు గృహాలను ఉచితంగా అందజేసింది. ఎంతో ఆశతో డబుల్ బెడ్రూం ఇండ్లలోకి అడుగు పెట్టిన ఆ పేదలకు కష్టాలు వెంటాడుతున్నాయి. కేటాయించిన నిధులతో సకాలంలో మౌలిక వసతులు కల్పించి వారి జీవన ప్రమాణాల పెంపునకు కృషి చేయాల్సిన కాంగ్రెస్ సర్కారు.. డబుల్ ఇండ్ల మౌలిక వసతుల కల్పనపై శీతకన్ను వేసింది. ఫలితంగా బాధితులంతా రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్నారు. కరెంట్, లిఫ్ట్, మంచినీరు ..ఇలా సమస్యలతో డబుల్ బెడ్రూం ఇండ్లలో ఉండలేని పరిస్థితి నెలకొన్నదని, ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని మౌలిక సదుపాయాలు కల్పించాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. గత వారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో లబ్ధిదారులు ఆందోళన చేపట్టగా, తాజాగా సోమవారం ఖైరతాబాద్ జలమండలి ప్రధాన కార్యాలయం ముందు అహ్మద్‌గూడ డబుల్ బెడ్రూం ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 200 మంది నిరసన చేపట్టారు. మంచినీటి సౌకర్యాలు వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సంస్థ ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అయితే అహ్మద్‌గూడలో కేవలం వాల్వ్‌ల నిర్మాణం పూర్తి చేస్తే నీటి కష్టాలు తొలగిపోతాయి.. కానీ రూ. 3 లక్షల వాల్వ్‌ల కోసం.. జీహెచ్‌ఎంసీ, జలమండలి మధ్య ఉన్న సమన్వయం లోపం వల్ల లబ్ధిదారులకు నీటి కష్టాలు వెంటాడుతున్నాయి.

**ఆందోళనలు ఉధృతం చేస్తాం..**

**- విజయ్‌కుమార్, 2బీహెచ్‌కే ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు**

అహ్మద్‌గూడలో ఇండ్లలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులుపడుతున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన జీహెచ్‌ఎంసీ నిర్లక్ష్యం చేస్తున్నది. ఇదే విషయమై జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ప్రజావాణిలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించాం. వారం రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తాం.